క్లుప్తంగా

ఆంజనేయునికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాంధ్లవీధిలో వెలసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో ఆకుపూజ జరిపారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన వినాయక ఆలయం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో నేటి నుంచి మూడురోజుల పాటు వినాయక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ. 40 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ 9న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7, 8వ తేదీలలో ప్రత్యేక పూజలు, హోమాలు, పారాయణాలు జరుగుతాయన్నారు. స్వామి వారి మూలమూర్తికి కావాల్సిన రాతిని మహాబలిపురం నుంచి తీసుకొచ్చి తిరుపతిలోని శిల్పుల ద్వారా విగ్రహాన్ని తయారు చేయించామన్నారు. ఉపాధ్యాయుడు తలమంచి రమణారెడ్డి సహాయంతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుపుతున్నట్లు చెప్పారు.

ఆర్యవైశ్య పేదలకు చేయూత



నగదు అందిస్తున్న క్లబ్ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : వాసవీ క్లబ్ ద్వారా ఆర్యవైశ్య పేదలకు సహాయపడాలనే ఉద్దేశంతో ప్రతి నెలా 12 మంది ఆర్యవైశ్య పేదలకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.500 నగదును చేయూత కింద అందిస్తున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ తిరునామల కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వాసవీ బాలాలయంలో జరిగిన క్లబ్ సమావేశంలో పేదలకు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, సోమశేఖర్, వేమమంజుల, విజయలక్ష్మి, సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.శేఖర్



రాయచోటి (జగదాంబసెంటర్) : ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెద్దపల్లి శేఖర్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు నుంచి నియామకపత్రాన్ని ఆయన అందుకున్నారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ తన జాతి బిడ్డల కోసం ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

డ్వాక్రా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్

పెనగలూరు : డ్వాక్రా సంఘం సభ్యులను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేయాలని ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సిబ్బందితో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా చేసేందుకు బ్యాంకుల నుంచి తగినంత రుణం మంజూరు చేయిస్తామన్నారు. అలాగే లోకోస్ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఉన్నతి లోన్స్‌పై ఎస్సీ, ఎస్టీలకు రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. బ్యాంకు లోన్లు సకాలంలో కట్టేలా యానిమేటర్లు సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. వెలుగు సీసీలు శివకుమార్, ఆనంద్, సుబ్రమణ్యం, యానిమేటర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రామాపురం : నేడు, రేపు వంగిమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గంగనేరు ఫీడర్ పరిధిలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య దుస్థితి..

ప్రజారోగ్యం అధోగతి



సిద్దవటం మఠం వీధిలో ఇండ్ల మధ్యలో ఉన్న చెత్తాచెదారం



మాధవరం–1 ప్రధాన రహదారికి పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

- ఇళ్ల మధ్యల్లోనే చెత్తకుప్పలు, మురుగునీరు
- దోమల వృద్ధితో రోగాల బారిన ప్రజలు
- తూతూ మంత్రంగా అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు

సిద్దవటం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు ఆచరణలో అందుకు తగ్గ చర్యలు చేపట్టడం లేదు. వీధుల్లో, ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటున్నా, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నా తమకేమీ పట్టనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి తూతూ మంత్రంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వారానికి ఒక సారి డ్రైడేను పాటించండి, నీటి డ్రమ్‌లను శుభ్రంగా ఉంచుకోండని సూచిస్తూ మమ అనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే నాథుడే లేకపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మండల కేంద్రంతోపాటు మాధవరం–1 గ్రామ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలనీల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం, మురుగనీరు దర్శనమిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం నెలకొని తీవ్ర దుర్గంధం వల్ల దోమల వృద్ధి చెందుతున్నాయి. దోమల కుట్టడం వల్ల ప్రజలు రోగాల బారీన పడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇళ్ల మధ్య మురుగునీరు, నిల్వ ఉండి దుర్వాసనకు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దవటంలో డీసీసీ బ్యాంకు, మఠం వీధిలో మరి కొన్ని చోట్ల చెత్తకుప్పలు, దిగువపేటలో ముగురు నీరు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు చెత్త, మురుగును తొలగించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం



డ్రైనేజీలో చెత్తాచెదారం అంతా చేరి మురుగుగా మారింది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం వస్తే నీరు పోక అక్కడే నిలిచిపోతుంది. దీంతో జ్వరాలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కె.వెంకట్రామిరెడ్డి, మాధవరం–1, సిద్దవటం

చెత్తను తొలగించండి



వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. పారిశుధ్య నిర్వహణ లోపించింది. ఈ కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమకాటుకు వ్యాధుల బారీన పడుతున్నాం. వర్షాకాలం కావడంతో సమస్య తీవ్రమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపడితే బాగుంటుంది.

- కోటపాటి సుబ్బరాయుడు, సిద్దవటం

ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేద్దాం



సమస్యలు వింటున్న, ఎమ్మెల్యే, వైస్‌ఎంపీపీ



పాల్గొన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామాలలో వ్యవసాయం, తాగునీరు, రోడ్లు తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం వాటి స్థితిని అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సర్వసభ్య సమావేశంకు హాజరయ్యానని, సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రతి సర్పంచ్, ఎంపీటీసీలకు సహకారం ఉంటుందని నాలుగు మాటలతో ముగించారు. ఈ కార్యక్రమాలలో జెడ్పీటీసీ రత్నమ్మ, అన్వర్‌బాషా, ఆర్వీ రమణ, హరికృష్ణ, రౌఫ్, రామకృష్ణ, గోపీ, మల్లి, మండల శివయ్య, శ్రీరాం వినోద్, బుడుగు శివయ్య, చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూడండి



మండల పరిస్థితిపై సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

వీరబల్లి : మండలంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి తెలిపారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు సీతంపేటలో పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులను ఆరా తీశారు. మండలంలో ఉన్న తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలానే తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాల చుట్టూ మురికికాలువలు ఉండటంతో మురికినీరు నిల్వ ఉంటోందన్నారు. దీంతో ఈగలు, దోమలు అధికంగా ఉన్నాయని, దీంతో పలు వ్యాధులు వ్యాప్తిస్తున్నాయని ప్రజలు, విద్యార్థులు సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. వెంటనే ఆమె ఎంపీడీఓకు ఫోన్ చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయని వార్డెన్ సుబ్బయ్య రాజు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆమె మండలంలోని హాస్టల్ సమస్యలపై నివేదిక తయారుచేసి అందించాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్ఐ గోపి, రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యాభివృద్ధికి కమిటీలు దోహదం



చిన్నమండెం: మాట్లాడుతున్న ఎంఈఓ శివానాయక్



పుల్లంపేట: హాజరైన ఉపాధ్యాయులు

చిన్నమండెం : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గుణాత్మక విద్యాభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీలు దోహదపడతాయని ఎంఈఓ శివానాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దోహదపడే పాఠశాల కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకుందామని తెలిపారు. ఈ నెల 8న జరిగే ఎన్నికలను సజావుగా జరిపేందుకు పోలీసుల సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

పుల్లంపేట : పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎంఈఓ చక్రాధర్ రాజు పేర్కొన్నారు. ఈనెల 8న జరగబోయే స్కూల్ కమిటీ ఎన్నికలు (ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు)సజావుగా నిర్వహించాలన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యవేక్షణ అధికారిగా కరుణాకర్‌ను నియమించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ చక్రాధర్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాలను పూర్తి చేయాలి

సిద్దవటం : పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్యలు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం హౌసింగ్‌పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం మండల పరిధిలో 1069 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులు 600 గృహాలను నిర్మించుకున్నారని, 465 అసంపూర్తిగా ఉన్నాయన్నారు. 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకొని గృహాలను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఉపాధి ఏపీఓ నరసింహులు, ఆర్ఐ అనూరాధ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రాంతీయ సదస్సును జయప్రదం చేద్దాం

రాయచోటి అర్బన్ : ఈనెల 10వ తేదీ శనివారం అనంతపురం పట్టణంలో నిర్వహింపతలపెట్టిన మున్సిపల్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లికార్జున కోరారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశం అనంతపురం పట్టణంలోని విద్యానగర్ సంపద కమ్యూనిటీ హాల్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహనరావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశంలో ఉమ్మడి కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని మున్సిపాలిటీల మినిస్టీరియల్ సిబ్బంది, పరిపాలనా కార్యదర్శులు తప్పక హాజరై విజయవంతం చేయాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

తల్లిపాలను మించిన ఔషధం లేదు



బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : పిల్లలకు తల్లిపాలను మించిన ఔషధం మరొకటి లేదని లయన్స్ క్లబ్ జీఎంటీ కో–ఆర్డినేటర్ పీఎస్ హరినాథరెడ్డి, జోన్ ఛైర్మన్ మహమ్మద్, రాయచోటి క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డిలు అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు క్లబ్ ఆధ్వర్యంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇందాద్, హరీష్ చంద్ర, నారాయణరెడ్డి, వినోద్‌కుమార్ నాయక్‌తోపాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లోనే ఇ–పంట నమోదు



నేకనాపురంలో పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మురాషావలి

సిద్దవటం : రైతుల పొలాల వద్దకు వెళ్లి ఇ– క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని చేయాలని వ్యవసాయ సహాయకులకు, వీఆర్‌ఓలకు ఆయన సూచించారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో జరుగుతున్న ఇ–క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ– క్రాప్ వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. ప్రతి రైతు పంటలను విధిగా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, వీఆర్‌ఓ రేణుక, రైతులు పాల్గొన్నారు.

ఇ–పంట నమోదు తప్పనిసరి

రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఇ–పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని క్షేత్రస్థాయి వరి పండిస్తున్న ఓ రైతు పొలంలో పంట నమోదు ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు రైతు సేవా కేంద్రం లోని వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఈ– పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు.

పంట నమోదును వేగవంతం చేయాలి

ఇ–పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ సిబ్బందికి బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు సూచించారు. మండలంలోని జంగాలపల్లె గ్రామంలో ఇ–పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగాలపల్లెలో రైతు పల్లె ఎల్లారెడ్డికి చెందిన 2 ఎకరాల దోస పంటను, ఆలం సుబ్బరాయుడుకు చెందిన 1.50 ఎకరాల వరి పంట సాగును ఇ–పంట కింద నమోదు చేశామన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందన్నారు. అదే నెల 19 నుంచి 24 వరకు సామాజిక తనిఖీ, 25, 26 తేదీలలో అభ్యంతరాల స్వీకరణ, 30న తుది జాబితాను ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో కత్తిరింపులతో దిగుబడులు

సిద్దవటం : మామిడి తోటల్లో కత్తిరింపుల ద్వారా చీడ, పీడలు తగ్గి మంచి దిగుబడులు సాధిస్తాయని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జ్యోతి, పొన్నవోలు, వంతాటిపల్లె, ఎస్. రాజంపేట గ్రామాల్లోని మామిడి రైతులకు జ్యోతి గ్రామంలో మామిడి కొమ్మల కత్తిరింపులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ 10 సంవత్సరాల పైబడిన మామిడి తోటల్లో జూలై, ఆగస్టు నెలాఖరు వరకు మామిడి కొమ్మలు కత్తిరింపు చేసుకోవచ్చన్నారు. కత్తిరింపులు చేయని ఎడల కేవలం 15 శాతం సూర్యరస్మి మాత్రమే కొమ్మలకు అందుతుందన్నారు. దీంతో ఆకులు కిరణజన్య సంయోగ ప్రక్రియ ద్వారా ఆహారం తయారు చేసుకోలేక పూత రావడం జరగదన్నారు. కొమ్మల కత్తిరింపులో భాగంగా ఎండు కొమ్మలు, తెగుళ్లు, ఆశించినా, కొమ్మలు అడ్డదిడ్డంగా ఉన్నా కొమ్మలను కత్తిరించడం వల్ల చాలా శాతం తెగుళ్లను అరికట్టవచ్చునన్నారు. కత్తిరింపులు చేసిన తరువాత సెప్టెంబర్ లోపు ఒక్కో చెట్టుకు 2 కిలోల యూరియా, 4 కిలోల సూపర్ పాస్ఫేట్, 1.5 కిలోల పొటాష్, పైపాటుగా వేసుకోవాలన్నారు. అలాగే కత్తిరించిన కొమ్మలకు, కాండంపై మైలుతుత్తి, సున్నం పేస్టుగా చేసి పూసుకోవాలన్నారు. అక్టోబర్‌లోపు చెట్ల దగ్గర దుక్కులు చేసుకోవచ్చని సూచించారు. నవంబర్ నుంచి ఎటువంటి దుక్కులు దున్నరాదని తెలిపారు. ఉద్యాన రైతులందరూ ఏపీఎంఐపీ కింద డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శ్రీనాథ్, సందీప్, మామిడి రైతులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే పాలు పట్టాలి



వీరబల్లి: పోషక పదార్థాల అవసరాన్ని తెలియజేస్తున్న అధికారులు

రామాపురం : బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని సూర్యనారాయణపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని చేపట్టారు. మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు బిడ్డకు పట్టడంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి ఏ విధంగా పాలు పట్టాలనే విషయాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు జ్యోతి, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతంతో సమానం

వీరబల్లి : తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలితమ్మ, ఉపాధ్యాయులు తెలియజేశారు. మంగళవారం సీతంపేట సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సీతంపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పోషక పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలన్నారు. ఆరోగ్య విషయాలపైన వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్

సుండుపల్లె : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉంటూ భవిష్యత్తును నిర్మించుకోవాలంటూ మండల సబ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మిన్నంరెడ్డి కృష్ణారెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మాదక ద్రవ్యాలను సేవించి యువత పాడవుతున్నారన్నారు. వీటి వల్ల మన ఆరోగ్యంతో పాటు జీవితాలు నాశనం అవుతాయన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 1985 నుంచి ఎన్‌డీపీఎస్ యాక్ట్ అమలులో ఉందని, ఈ యాక్టు ప్రకారం గంజాయి అమ్మినా, కొన్నా, సేవించిన పది నుంచి ఇరవై సంవత్సరాలు జైలు శిక్ష తప్పదన్నారు. వాహనదారులు నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. మైనర్లు లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేందుకు అనర్హులని, వారికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ద్వారా విద్యార్థులు మోసపోరాదని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగార్జున, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నీటి కనెక్షన్లు తొలగించండి



గ్రామస్తులకు అక్రమ నీటి కనెక్షన్‌లు తొలగించాలని సూచిస్తున్న అధికారులు

సిద్దవటం : అక్రమంగా తాగునీటి కనెక్షన్లు పెట్టుకున్నవారు స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలియజేశారు. మంగళవారం మాధవరం–1 పంచాయతీలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని కొమ్మనాయునిపల్లె రహదారి వద్ద నివాసం ఉంటున్న కొందరు తాగునీటి పైప్‌లైన్‌కు అక్రమ కనెక్షన్‌లు పెట్టుకున్నారని అవన్నీ తొలగించాలని తెలిపామన్నారు. ఇంకా కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కనెక్షన్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. అవన్నీ తొలగించాలన్నారు. నిబంధనలు పాటించని కనెక్షన్లు తొలగించకుంటే నోటీసులు జారీ చేసే వాటిని తీసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యా సంఘం నాయకులు, విద్యార్థులు

రాయచోటి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కోటేశ్వరరావులు డిమాండ్ చేశారు. తమ సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన, పేదవర్గాల విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలే దిక్కు అని తెలిపారు. జిల్లాలోని 75 శాతం వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన 25 శాతం ప్రభుత్వ భవనాల్లో ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఇదే సమయంలో హాస్టల్స్‌లో తాగునీటి, మరుగుదొడ్ల వసతి లేవన్నారు. బాలికల హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెస్ చార్జీలను, కాస్మోటిక్ చార్జీలను పెంచాలంటూ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో హాస్టల్ సీట్లను పెంచాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి నేతలు ప్రశాంత్ కార్తీక్, వాసుదేవ్‌నాయక్, కుమార్, సతీష్ నాయక్, మురళీ, సుభాన్‌బాషా, అంజన్‌రెడ్డి, శ్రీకాంత్‌తోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.